

ఎమ్మెల్యే చిట్టెం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, ప్రజాపంథ పార్టీల కార్యకర్తలు

# ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ గెలుస్తా..

- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, ప్రజాపంథా పార్టీ కార్యకర్తలు

ఊట్కూర్, అక్టోబర్ 3 : నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుస్తానని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. బిజ్వారానికి చెందిన బీజేపీ, ప్రజాపంథా పార్టీలకు చెందిన 30మంది కార్యకర్తలు మంగళవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని ఓర్వలేక కొందరు నేతలు తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని, ఎన్ని కుట్రలు పన్నినా నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం, కార్యకర్తల బలంతో మక్తల్ గడ్డపై మళ్లీ గులాబీ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్‌గౌడ్, రాజు, జగదీశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



మహేశ్ (ఫైల్)

మల్దకల్, అక్టోబర్ 3 : చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తాటికుంటలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు.. తాటికుంటకు చెందిన బోయ మహేశ్(25), బోయ శేఖర్ ఇద్దరూ కలిసి మంగళవారం సాయంత్రం చేపలు పట్టేందుకు రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. చేపలు పట్టేందుకు గానూ కట్టెకు వ్యవసాయ మోటర్ల సర్వీస్ వైర్లకు సంబంధించిన విద్యుత్ వైర్లు అమర్చుకున్నారు. ఒకరు కట్టెకు వైరు కట్టి పట్టుకుంటే మరొకరు చేపలు బయటకు వచ్చే సమయం చూసి వైర్‌ను దాదాపు 10 మీటర్ల దూర లాగుతారు. దీంతో చేపలు చనిపోయి నీటిలో తేలగా వాటిని పట్టుకుంటారు. ఈక్రమంలో కట్టెకు కట్టిన విద్యుత్ వైర్ తెగిపోయి నీటిలో పడిపోయింది. దీంతో మహేశ్ అక్కడికక్కడే మృతి చెందగా శేఖర్ ప్రాణాలతో బయట పడ్డాడు. దీంతో తాటికుంటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# నూతన మండలంగా ఏదుల

- జీవో విడుదల చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ
- నెరవేరిన ఏదుల వాసుల కల

గోపాల్‌పేట, అక్టోబర్ 3 : మండలంలోని ఏదులను నూతన మండలంగా ఏర్పాటు చేస్తూ మంగళవారం తెలంగాణ సర్కారు జీవో విడుదల చేసింది. ఏదుల గ్రామస్తులు రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములిచ్చి తమ గ్రామాన్ని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని పలుమార్లు మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని కోరగా తప్పకుండా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కాగా మంత్రి కృషితో గోపాల్‌పేట మండలంలోని ఏదుల, రేవల్లి మండలంలోని చెన్నారం, చీర్కపల్లి, కోడేరు మండలంలోని సింగాయపల్లి, తుర్కదిన్నె, మాచుపల్లి, ముత్తిరెడ్డిపల్లి, రేకులపల్లితో కలిసి ఏదుల మండలంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంత్రి నిరంజన్ రెడ్డి, సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# ఓటరు జాబితాలో తప్పులు సరిదిద్దుకోవాలి

- రేపే ఓటరు తుది జాబితా ప్రచురణ
- రోల్ అబ్జర్వర్ భారతీలక్పతినాయక్




సమీక్ష నిర్వహిస్తున్న భారతీ లక్పతినాయక్, చిత్రంలో వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి, అక్టోబర్ 3 : తుది ఓటరు జాబితాలో తప్పులు లేకుండా సరిదిద్దుకోవాలని ఉమ్మడి జిల్లా రోల్ అబ్జర్వర్ భారతీలక్పతి నాయక్ సూచించారు. మంగళవారం వనపర్తి కలెక్టరేట్‌లో వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల జిల్లాల అదనపు కలెక్టర్లు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వో సూపర్‌వైజర్లతో తుది ఓటరు జాబితా ప్రచురణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త పోలింగ్ కేంద్రాలు ఎన్ని? అందులో ఎంతమంది ఓటర్లు ఉన్నారు? కొత్త ఓటర్లు ఎంతమంది ఉన్నారు? ఇంకా ఎవరైనా మిగిలిపోయారా? తదితర వివరాలను ఈఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. నియోకవర్గంలోని ప్రముఖుల పేర్లు జాబితాలో వచ్చాయా? లేదా? చూసుకోవాలన్నారు. ఓటరు జాబితాను ముద్రించిన అనంతరం అందులో దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లను గుర్తించాలన్నారు. తుది ఓటరు జాబితాను ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి ప్రతి పోలింగ్‌కేంద్రంలో ఉంచాలన్నారు. అనంతరం ఆయా జిల్లాల కలెక్టర్లు మాట్లాడారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, తిరుపతిరావు, శ్రీనివాస్, ఆర్డీవోలు పద్మావతి, వెంకట్రాంరెడ్డి, గోపీరాం, నాగరాజు, చంద్రకళ, తాసీల్దార్లు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మృతి చెందిన ఎద్దుతో రైతు బాలకృష్ణ

# పిడుగుపాటుకు ఎద్దు మృతి

వెల్దండ, అక్టోబర్ 3 : పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని చెర్కూర్ గ్రామంలో చోటు చేసుకున్నది. వివరాలిలా.. గ్రామానికి చెందిన రైతు బాలకృష్ణ సోమవారం పొలం వద్ద ఎద్దును కట్టేసి ఇంటికొచ్చాడు. అదే రోజు రాత్రి కురిసిన భారీ వర్షానికి పిడుగు పడడంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందగా మండల పశువైద్యాధికారి శ్యాంసుందర్ పరిశీలించారు. ఎద్దు విలువ రూ.50వేలు ఉంటుందని, తనను ఆదుకోవాలని రైతు కోరాడు.

# ఇబ్బందులకు గురి చేస్తున్నారు..

- భర్త, అత్తామామలు, ఆడపడుచుపై చర్యలు తీసుకోండి
- పోలీసులను ఆశ్రయించిన వివాహిత
- గద్వాల జిల్లాకేంద్రంలో ఘటన

గద్వాల అర్బన్, అక్టోబర్ 3 : తనను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తన భర్త, అత్తామమలు, ఆడపడుచుపై చర్యలు తీసుకోవాలని వివాహిత పోలీసులను ఆశ్రయించిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలో చోటు చేసుకున్నది. బాధితురాలి కథనం ప్రకారం.. జిల్లాకేంద్రానికి చెందిన రమేశ్ తన కూతురు శ్వేతను ఐదేండ్ల కిందట విజయ్‌కుమార్‌కు ఇచ్చి వివహం చేశారు. ఆరునెలల వరకు వీరి కాపురం సజావుగా సాగింది. శ్వేత గర్భం దాల్చడంతో ఇప్పుడే పిల్లలు వద్దంటూ ఆమె భర్త శ్వేతకు మాయమాటలు చెప్పి అబార్షన్ చేయించాడు. ఇలా రెండుసార్లు అబార్షన్ చేయించగా కొన్ని రోజుల నుంచి విజయ్‌కుమార్ వ్యవహార శైలి మారుతూ వచ్చింది. ఈక్రమంలో తన అత్త శంకరమ్మ, మామ నర్సింహులు, ఆడపడుచులు తిమ్మలమ్మ, లక్ష్మీదేవి, వసంత, శోభ మాటలను విజయ్‌కుమార్ వింటూ శ్వేతను శారీరకంగా, మానసికంగా హింసించేవాడు. కాగా తనపై దాడి చేసిన భర్త, సహకరించిన అత్తామామ, అడపడుచులపై చర్యలు తీసుకోవాలని శ్వేత మంగళవారం గద్వాల టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీస్‌లు పేర్కొన్నారు.

# గుడిసెకు నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

ధరూర్, అక్టోబర్ 3 : గుర్తు తెలియని వ్యక్తులు గుడిసెకు నిప్పు పెట్టిన ఘటన మండలంలోని దోర్నాల గ్రామంలో చోటు చేసుకున్నది. ఏఎస్సై వెంకట్రాములు కథనం ప్రకారం.. దోర్నాలకు చెందిన సాయన్న గుడిసెకు సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగ దగ్ధమైంది. ఘటనపై సాయన్న మంగళవారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఆంజనేయులు, ఈశ్వరన్నపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఏఎస్సై వెల్లడించారు.

# టిప్పర్ ఢీకొని వృద్ధురాలు మృతి



టిప్పర్ కిందపడి మృతి చెందిన వృద్ధురాలు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 3 : టిప్పర్ ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని తూడుకుర్తిలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు తూడుకుర్తికి చెందిన చంద్రమ్మ (60) మంగళవారం కిరాణం కొట్టు వద్ద ఉండగా మొరం లోడుతో వెళ్లున్న టిప్పర్ కింద ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

# జీవన చిత్రాలు








కల్వకుర్తి మండలం జీడిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాల ప్రహరీలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సర్పంచ్ కల్పన, ఉపసర్పంచ్ ఖాజా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గోడలపై వేయించిన చిత్రాలు గ్రామస్తులను ఆలోచింపజేస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాల గోడపై ఉన్న చిత్రాలు విద్యార్థులను ఆకర్షించేలా ఉన్నాయి. గ్రామ పరిశుభ్రత, పచ్చదనంపై వేసిన చిత్రాలు, కొటేషన్లను చూసిన వారంతా తమ ఇంటి ముందు మొక్కలు నాటుకొని సంరక్షిస్తూ హరిత గ్రామంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములవుతున్నారు.

**- కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్30**

# నిషేధిత అలవి వలల వినియోగం

- కేసు నమోదు చేసిన పోలీసులు

ధరూరు, అక్టోబర్ 3 : నిషేధిత అలవి వలలు వినియోగించినందుకు గానూ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకట్రాములు తెలిపారు. ఏఎస్సై కథనం ప్రకారం మండలంలోని ఖమ్మంపాడు గ్రామంలో ఆంధ్రాకు చెందిన గొల్లయ్య, నాగరాజు, శ్రీనివాసులు నిషేధిత అలవి వలలతో అక్రమంగా చేపలు పడుతున్నట్లు జిల్లా ఫిషరీస్ అధికారిణి షకీలబానోకు సమాచారం అందింది. దీంతో ఆమె గ్రామానికి వెళ్లి దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. అధికారిణి ఫిర్యాధు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెల్లడించారు.

# వృద్ధురాలు అదృశ్యం, కేసు నమోదు

నాగర్‌కర్నూల్ మండలం పెద్దముద్దునూర్‌కు చెందిన ఉలిగమ్మ(75) అదృశ్యం కాగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఈనెల 1వ తేదీన ఇంటి నుంచి కూలి పనులకు వెళ్లిన ఉలిగమ్మ తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.